సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): మండల సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా సాగింది. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పలువురు మండల స్థాయి అధికారులు ఉండటంతో వారు సమావేశానికి హాజరుకాలేదు. దీంతో కొన్ని అంశాలపై మాత్రమే సమీక్ష నిర్వహించారు. సంక్షేమ హాస్టల్‌లో మూడేళ్లుగా విద్యార్థులకు ట్యూషన్ చెప్పడం లేదని, దీంతో విద్యార్థులు నష్టపోతున్నారని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఈఓ నర్సింహారెడ్డి స్పందిస్తూ హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, ఎలాంటి కొర్రీలు పెట్టకుండా రైస్ మిల్లర్లతో సంబంధిత అధికారులు మాట్లాడాలని కడవేర్గు, ఆకునూరు ఎంపీటీసీలు గదరాజు యాదగిరి, సుంకరి శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దొమ్మాటలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాగు నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ సుభాషిని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అనిల్ స్పందిస్తూ ప్రతి ఇంటికీ పైపులైన్ వేశామని.. త్వరలోనే కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేయిస్తామన్నారు.
అనంతరం ఎంపీపీ కరుణాకర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అధికారులు రాలేదని.. దీంతో అన్ని శాఖలపై సమీక్షించలేకపోయామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ తారిక్ అన్వర్, తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఏఓ ఎండీ అఫ్రోజ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవొద్దు


అక్కన్నపేట: ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్)/మద్దూరు/చేర్యాల, దుబ్బాక రూరల్: మండలంలోని రామవరం, గోవర్ధనగిరి, ధర్మారం, నందారం, కేశనాయక్‌తండా, గొల్లకుంట, అక్కన్నపేట, జనగాం, చౌటపల్లి, మంచినీళ్లబండ, పెద్దతండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఐకేపీ, గ్రామైఖ్య సంఘాల సభ్యులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవొద్దని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు తిరుపతి, భిక్షపతి, రాజు, చరణ్‌సింగ్, శివ, ఆయా గ్రామాల ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని నర్సాయపల్లి, గాగ్లిపూర్, లద్నూర్, పీఏసీఎస్, ఐకేపీ అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ అధికారి ప్రసాద్, గీతా గ్రామైఖ్య అధ్యక్షురాలు కనకలక్ష్మి, కార్యదర్శి రాములమ్మ, సీసీ సిద్ధిమల్లయ్య తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండల పరిధిలోని శభాష్‌గూడెం, నాగపురి, ఆకునూరు, రాంపూర్, చిట్యాల, తాడూరు, వేచరేణి, ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ ప్రకాశం ప్రారంభించారు. దుబ్బాక మండలంలోని చీకోడ్, గంభీర్‌పూర్, వెంకటగిరితండాతో పాటు మరో 14 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

క్లుప్తంగా

వైభవంగా కృత్తిక మహోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో సోమవారం కృత్తిక మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చక వేదపండితులు మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చక, వేద విద్యార్థులు సామూహిక లక్ష సుబ్రహ్మణ్యనామాలు పఠిస్తుండగా, స్వామివారికి భస్మార్చన నిర్వహించారు.

హరీశ్‌రావుకే మా ఓటు


మాట్లాడుతున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): అభివృద్ధికి అడ్రస్‌గా నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావుకే ఓటేస్తామని రాజగోపాల్‌పేట ఆయా కుల సంఘాలు తీర్మానం చేసి సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్‌కు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలతో పాటు కులసంఘాల సంక్షేమం కోసం కృషి చేసిన హరీశ్‌రావుకే ఓటేస్తామని పేర్కొన్నారు.

మంజులారెడ్డికి టికెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న యువసేన నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలో నాలుగేళ్లుగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న మంజులారెడ్డికి హుస్నాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని మంజులక్క యువసేన నాయకులు కోరారు. సోమవారం పట్టణంలో వారు మాట్లాడుతూ.. వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా పేదల కుటుంబాల్లో వెలుగులు నింపి సమాజ సేవలో ముందున్నారని తెలిపారు. సమావేశంలో యువసేన నాయకులు పొన్నాల అశోక్, సురేష్, కళ్యాణ్, శ్రవణ్‌రెడ్డి, ప్రవీణ్, మహేష్, కిరణ్, తదితరులు ఉన్నారు.

'పొన్నం' వ్యాఖ్యలు సరికాదు

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఊరు ఎక్కడుందో తెలియని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధులు అన్నారు. సోమవారం పట్టణంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని పొన్నం మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రవీణ్‌రెడ్డి గౌరవెల్లి నిర్మాణానికి ఒక్క రూపాయి తేలేదన్నారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ చొరవతోనే గౌరవెల్లి పూర్తి చేశారని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధులు నేషనల్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ బీలునాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగాల సాయన్న, సర్పంచ్ రమేష్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే మా మద్దతు


మంత్రి హరీశ్‌రావుతో మాజీ సర్పంచ్‌లు

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మండల పరిధిలోని మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు. గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి సోమవారం మంత్రి హరీశ్‌రావును కలిసి బీఆర్‌ఎస్‌కే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి, కొమురయ్య, రాజు, బాలమణి, సత్యనారాయణ, అశోక్, శ్రీశైలం, దుర్గారెడ్డి, రాములు, రాజాగౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బాత్‌రూంలు లేకపోవడంతో ఇక్కడికి వచ్చే గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి


వంటేరు ప్రతాప్‌రెడ్డికి తీర్మానప్రతిని అందజేస్తున్న నాయకులు

వర్గల్(గజ్వేల్): మండలంలోని శేరిపల్లి యాదవసంఘం, సామలపల్లి ముదిరాజ్ సంఘ నాయకులు సీఎం కేసీఆర్‌కు మద్దతు ప్రకటించారు. ఈమేరకు సోమవారం ఆయా గ్రామాలను సందర్శించిన అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో సమావేశమై తమ నిర్ణయం ప్రకటించారు. ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని ఆయనకు అందజేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లత, బీఆర్‌ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యువాత


మృతిచెందిన గొర్రె పిల్లలను చూపుతున్న బాలయ్య

గజ్వేల్‌రూరల్: గుర్తుతెలియని జంతువుల దాడిలో మూగజీవాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోమటిబండలో సోమవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన గోవిందం బాలయ్య గొర్రెల పెంపకంతో పాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. తనకున్న గొర్రెలలో పెద్దవాటిని ఒక చోట, చిన్న గొర్రె పిల్లలను మరోచోట (దొడ్డి)లో వదిలిపెడుతున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి చిన్న గొర్రె పిల్లలను దొడ్డిలో వదిలివెళ్లగా సోమవారం ఉదయం వచ్చి చూడగా సుమారు 20 వరకు మృతిచెంది కనిపించడంతో బాధితుడు బాలయ్య ఆందోళనకు గురయ్యాడు. గుర్తు తెలియని జంతువుల దాడిలో గొర్రె పిల్లల మృతి చెందాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు


బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రవి, పీఏసీఎస్ చైర్మన్ కై లాష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిలుస్తాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

ములుగు(గజ్వేల్): పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ములుగు మండలం బండమైలారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గణేష్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్ శంకరప్ప, తదితరులు పాల్గొన్నారు.

'మేరీ మట్టి - మేరా దేశ్'కు అమరేందర్

కొమురవెల్లి(సిద్దిపేట): ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకల సందర్భంగా ఢిల్లీలో సోమ, మంగళవారం నిర్వహిస్తున్న మేరీ మట్టి- మేరా దేశ్ కార్యక్రమానికి మండల కేంద్రానికి చెందిన కటకం అమరేందర్ ఎంపికై నట్లు జిల్లా నెహ్రూ యువకేంద్రం యువజన అధికారి కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ.. మండలంలో సేకరించిన మట్టిని ఢిల్లీకి తీసుకెళ్లానని తెలిపారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న శశిధర్

సిద్దిపేటఅర్బన్: సామాజిక న్యాయం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం డిసెంబర్ 4న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సిద్దిపేటలోని సంఘం కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్, ఉపాధ్యక్షుడు రవీందర్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, బాలమణి, వెంకటాచారి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపెల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బెజ్జంకి, గుండారం, గూడెం తదితర గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అమలు చేసే గ్యారంటీలతో పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు


కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

హుస్నాబాద్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ సతీష్ అన్నారు. సోమవారం మీర్జాపూర్, నాగారం, ఉమ్మాపూర్, భల్లునాయక్ తండాల్లో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా డబ్బు, మద్యం ఇచ్చేందుకు వస్తే తిరస్కరించాలన్నారు. స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు మహేశ్, వివేక్ పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డిపై దాడి ప్రతిపక్షాల కుట్రే

- రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీందర్


గజ్వేల్: మాట్లాడుతున్న దేవీ రవీందర్

గజ్వేల్: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి ప్రతిపక్షాల కుట్రలో భాగమేనని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించబోతున్నారని తెలిసి ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తి దాడి చేశారని మండిపడ్డారు. ఓటమి భయంతో ఇలాంటి దాడులకు పాల్పడితే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కొండపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, బీఆర్‌ఎస్ నాయకులు బొగ్గుల సురేష్, పాల రమేష్‌గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాచారం గుట్ట దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి సైతం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, భాస్కర్, రమేష్, మనోహర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయకుట్రలో భాగమే..

సిద్దిపేటజోన్: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి రాజకీయ కుట్రలో భాగమే అని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి వ్యక్తిగత సహాయకుడు రాములు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన


మిరుదొడ్డిలో బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో

మిరుదొడ్డి(దుబ్బాక)/దౌల్తాబాద్/జగదేవ్‌పూర్/బెజ్జంకి: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మిరుదొడ్డిలోని గాంధీ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. సుమారు అరగంట పాటు జరిగిన ఆందోళనతో గజ్వేల్ మిరుదొడ్డి రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అలాగే ప్రభాకర్‌రెడ్డిపై దాడిని మర్కూక్ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్ ఖండించారు. బెజ్జంకి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జనాదరణ చూసి ఓర్వలేకనే దాడి చేశారని ఆరోపించారు. దౌల్తాబాద్ బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సూరంపల్లి అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

తొగుటలో దుకాణాలు బంద్

తొగుట(దుబ్బాక): ఎంపీపై దాడికి నిరసనగా పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి తొగుటలో దుకాణాలు బంద్ చేయించారు. దాడికి నిరసనగా మంగళవారం ఆందోళన చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ సబ్బండ వర్గాలకు సముచిత న్యాయం



మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) అధికారంలోకి వస్తే సబ్బండ వర్గాల అభ్యున్నతికి సముచిత న్యాయం జరుగుతుందని డీఎస్‌పీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వెంకట ప్రసన్న అన్నారు. మండలపరిధిలోని మల్లుపల్లి, చెప్యాలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చందు, లక్ష్మణ్, ప్రశాంత్, భాస్కర్, రాజు, కరుణాకర్, మీనా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

మద్దూరు(హుస్నాబాద్): గిరిజన ఆత్మబంధు మండల అధ్యక్షుడిగా మండలంలోని హనుమతండాకు చెందిన జాటోత్ కలరాం నాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ రూప్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మంద యాదగిరితో పాటు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌గౌడ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

◆ ఈటల గెలుపే లక్ష్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లింగారెడ్డిపల్లి, దౌలాపూర్, పలుగుగడ్డ, మందాపూర్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీధర్, నాయకులు గణేష్, యాదగిరి, కృష్ణమూర్తి, అశోక్ పాల్గొన్నారు.

◆ బీఎస్పీ ఇంటింటి ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): బీఎస్పీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి నిశాని రామచంద్రం సోమవారం మండలంలోని వడ్లూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బతుకులు మారాలంటే బీఎస్పీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకన్న, అసెంబ్లీ కార్యదర్శి రాజమల్లు, మండల అధ్యక్షుడు తిరుపతి, రామచంద్రం, వేమన, తదితరులు పాల్గొన్నారు.

◆ కలెక్టర్‌కు ఫిర్యాదు

హుస్నాబాద్: తాను కొనుగోలు చేసిన భూమిని తనకు కాకుండా మరొకరిపై విరాసిత్ మార్పిడి చేసి రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని సోమవారం హుస్నాబాద్‌కు వచ్చిన కలెక్టర్‌కు బాధిత మహిళ రాధమ్మ ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టి మా పేరిట పట్టా చేసి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

◆ అసత్య ప్రచారం మానుకోండి

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసింది కాంగ్రెస్ కార్యకర్త అంటూ బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేష్ పేర్కొన్నారు. సోమవారం మిరుదొడ్డిలో మాట్లాడుతూ.. ఎంపీపై కత్తితో దాడి చేసిన రాజుకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్షద్, మహేష్, మహేందర్, కిష్టయ్య, విజేందర్ పాల్గొన్నారు.

◆ కొండపోచమ్మకు ముడుపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్‌లో కేసీఆర్ మూడోసారి లక్ష మెజారిటీతో గెలవాలని మర్కూక్ మండలంలోని వర్దరాజ్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, సర్పంచ్ ప్రవీణ్, వెంకటేశం, మహేష్, సాయిబాబా సోమవారం కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ముడుపు కట్టారు.

◆ ఎంపీపై దాడి హేయమైన చర్య

సిద్దిపేటఅర్బన్/కొండపాక(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికలు సజావుగా నిర్వహించేలా పోలీస్ శాఖ చొరవ తీసుకోవాలని కోరారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య, కొండపాక రైతు బంధు సమితి కోఆర్డినేటర్ దొమ్మాట మహిపాల్‌రెడ్డి దాడిని ఖండించారు.

◆ మద్యం పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సోమవారం రాత్రి మండల పరిధిలోని ఆకునూరు వెళ్లే దారిలో పట్టుకున్నారు. కొత్త దొమ్మాట క్రాస్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాజేంద్రకుమార్ తనిఖీలు చేపట్టగా 128 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

◆ బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు

దుబ్బాక: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దుండగుడు కత్తితో దాడి చేసిన నేపథ్యంలో దుబ్బాక పట్టణానికి చెందిన బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ పెద్ది నవీన్ అనే వ్యక్తి తన వాట్సాప్ స్టేటస్‌లో ఎంపీపై అభ్యంతరకరమైన పోస్టులతో స్టేటస్ పెట్టాడు. గమనించిన దుబ్బాక బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహంతో పట్టణంలోని బీజేపీ కార్యాలయంoooంలో ఉన్న నవీన్ బయటకు తీసుకువచ్చి తీవ్రంగా దాడి చేశారు. అనంతరం అతడిని దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదుతో నవీన్‌పై, అతడిపై దాడి చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడికందుల, ఘనపురం గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి హత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని పేర్కొన్నారు. అంతకుముందు మండలంలోని పెద్దమాసాన్‌పల్లి రేణుకా ఎల్లమ్మ, తుక్కాపూర్‌లోని కామిక్ల అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, తిరుపతి, స్వామి, కృష్ణ ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.